నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 17 జనవరి 2025 | KHAMMAM

వైద్యురాలు, సిబ్బందితో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు..

- వైద్యులు సేవా దృక్పథంతో పనిచేయాలి
- పీహెచ్‌సీ, తహసీల్ తనిఖీల్లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

వేంసూరు, జనవరి 16: ఆసుపత్రికి వచ్చే రోగులతో మర్యాదగా వ్యవహరించాలని, విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ హెచ్చరించారు. వేంసూరు పీహెచ్‌సీ, తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో మందుల నిల్వలు, గర్భిణులకు అందుతున్న సేవలు, ఆసుపత్రి నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం కోసం ఉన్నామనే ఆలోచనా విధానంతో వైద్యులు, సిబ్బంది పని చేయాలన్నారు. సేవా దృక్పథంతో పని చేయడం వైద్య శాఖలో చాలా అవసరమన్నారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడానికి వీల్లేదని, సిబ్బంది సకాలంలో హాజరుకావాలన్నారు. అలాగే ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు, సిజేరియన్లు ఎన్ని చేశారని అడిగి తెలుసుకున్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, ఈ దిశగా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. మందుల స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని, కొరత లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్.. ఇక్కడి సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు అందుతున్నాయని, పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రజలకు సేవలు నిర్ణీత కాలంలోగా అందజేయాలని, ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమం లో తహసీల్దార్ ఎంఏ.రాజు, వైద్యాధికారులు డాక్టర్ కే.ఇందుప్రియాంక, డాక్టర్ కే.శ్రీవిద్య, డాక్టర్ హసీన, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

12 మంది మావోయిస్టులు మృతి

- ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం

కొత్తగూడెం ప్రగతి మైదానం, జనవరి 16: మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన భీకర యుద్ధంతో దండకారణ్యం దద్దరిల్లింది. ఇరువర్గాల మధ్య జరిగిన పోరులో 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లా పూజారీ కాంకేర్ అడవుల్లో పెద్ద ఎత్తున మావోయిస్టులు సంచరిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు బీజాపూర్, సుక్మా, దంతేవాడ జిల్లాల డీఆర్‌జీ జవాన్లతోపాటు కోబ్రా, సీఆర్‌పీఎఫ్‌కు చెందిన సుమారు 1,500 మంది బలగాల సంయుక్త ఆధ్వర్యంలో సెర్చింగ్ ఆపరేషన్స్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు భారీ ప్లీనరీకి రంగం సిద్ధం చేస్తున్నట్లు ముందుగానే సమాచారం తెలుసుకున్న పోలీస్ అధికారులు దానిని అడ్డుకునేందుకు తమదైన శైలిలో పావులు కదిపారు. ఇందులో భాగంగానే మూడు జిల్లాలకు చెందిన భద్రతా దళాలు వ్యూహాత్మకంగా వ్యవహరించి మార్పుర్–పూజారీ కాంకేర్ అటవీ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. దీంతో మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురుకాల్పులకు దిగారు. ఇరువర్గాల మధ్య సుమారు రెండున్నర గంటలపాటు విడతల వారీగా భీకర పోరు జరిగినట్లు తెలుస్తున్నది. నలువైపులా చుట్టుముట్టిన జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ మార్గంలోకి పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. కాల్పుల్లో సుమారు 12 మంది మావోయిస్టులు మృతిచెందినట్లుగా తెలుస్తున్నది. ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఘటనా స్థలం నుంచి ఒక ఎస్ఎల్ఆర్ రైఫిల్, ఒక 12 బోర్ తుపాకి, రెండు సింగిల్ షాట్ తుపాకులు, ఒక బీజీఎల్ లాంచర్, ఒక నాటు తుపాకితోపాటు మందుగుండు, ఇతర వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం తెలిపారు. అయితే స్వల్ప విరామం తర్వాత పెద్ద ఎత్తున జరిగిన ఆపరేషన్‌గా తెలుస్తున్నది. ఈ ఘటనతో ఒక్కసారిగా ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీ వాసులు ఉలిక్కిపడ్డారు. ఇప్పటికే తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో భద్రతా దళాలు అప్రమత్తమై అడవులను జల్లెడ పడుతున్నాయి.

ఈసారైనా నిగ్గుతేలేనా?

అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన పత్తి పంట (ఫైల్)

- నిరుడు కూడా ఇదే తరహాలో అగ్నిప్రమాదం
- నేటి వరకు మిస్టరీగానే మిగిలిన నాటి ఘటన
- తాజాగా మరోసారి అదే తరహా సంఘటన
- ఖమ్మం పత్తి యార్డు ప్రమాదాలపై సందేహాలు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 16: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని పత్తి యార్డులో ఏటా జరుగుతున్న అగ్ని ప్రమాదాలపై సవాలక్ష సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిరుడు జరిగిన అగ్ని ప్రమాదం కూడా ఇప్పటికీ మిస్టరీగానే మిగిలిపోయింది. తాజాగా బుధవారం జరిగిన అగ్ని ప్రమాదం కూడా అనేక అనుమానాలకు తావిస్తున్నది. అయితే, ఈ మిస్టరీలు ఏంటనేది అధికారులు ఇప్పటికైనా నిగ్గుతేలుస్తారా? లేదా? అనే అంశంపై అటు అన్నదాతలు, ఇటు వ్యాపారులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

ఖమ్మం ఏఎంసీ పత్తి యార్డులో గత ఏడాది కూడా అచ్చం ఇదే తరహాలో అగ్నిప్రమాదం జరిగింది. కాకపోతే అప్పుడు తెల్లవారుజామున ప్రమాదం జరగగా.. ఇప్పుడు రాత్రి వేళ ప్రమాదం సంభవించింది. అయితే.. నిరుడుగానీ, ఇప్పుడుగానీ కాలిపోయిన పంట మాత్రం ఖరీదుదారులదే కావడం గమనార్హం. 'దాదాపుగా ఏటా ఇలాంటి ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి? ప్రమాదం జరిగిన తరువాత అందుకు కారణం ఏమిటి?' అనే ప్రశ్నలకు సమాధానాలను అటు ఏఎంసీ అధికారులు గానీ, ఇటు పోలీసులు గానీ ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. ప్రమాదం జరిగిన వెంటనే సంబంధిత శాఖల అధికారులు ఒకటి రెండు రోజులు హడావిడి చేయడం తప్ప.. సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకున్న చర్యలు శూన్యమని రైతులు, వ్యాపారుల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

సాంకేతిక పరిజ్ఞానం ఉన్నప్పటికీ..

ఖమ్మం మార్కెట్ అంటేనే సాంకేతిక పరిజ్ఞానానికి కొదవ లేదనే మాట ఉంది. మూడు యార్డుల్లో జరిగే క్రయవిక్రయాలను నిశితంగా పరిశీలించేందుకు అడుగడుగునా సీసీ కెమెరాలు ఉన్నాయి. ప్రధాన గేట్ నుంచి ఓ మనిషి ప్రవేశిస్తే.. అతడు నిఘా నీడలో ఉన్నట్లే. ఇంతటి వ్యవస్థ కలిగిన యార్డుల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతుండడం ఒక ఎత్తు అయితే.. అవి ఎలా జరిగాయనేది అంతు చిక్కకపోవడం మరో ఎత్తులా కన్పిస్తున్నది. నిరుడు పత్తి యార్డులో ప్రమాదం జరిగిన సమయంలో ఆక్కడి షెడ్లకు అసలు కరెంట్ సరఫరా లేదని, సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ఎలాంటి ఆనవాళ్లూ కనపడలేదని అధికారులు అప్పట్లోనే వెల్లడించారు. అయినప్పటికీ బయటకు మాత్రం విద్యుదాఘాతం కారణంగానే ప్రమాదం జరిగిందని చెప్పారు. అదే అంశాన్ని పొందుపరుస్తూ నివేదిక తయారు చేశారు. కొద్ది నెలల తరువాత బాధిత వ్యాపారికి బీమా రూపంలో పరిహారం సైతం అందింది. కానీ.. ప్రమాదం ఎలా జరిగిందనే విషయాన్ని మాత్రం అధికారులు బహిరంగ పరచలేదు. అచ్చం అదే తరహాలో బుధవారం రాత్రి కూడా అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో గురువారం యార్డును పరిశీలించిన ప్రతి ఒక్కరూ ఇవే విషయాల గురించి చర్చించుకున్నారు. అనేక అనుమానాలు లేవనెత్తారు. 'పత్తి యార్డులో ప్రమాదం జరిగితే నిజం బయటకు ఎలా వస్తది?' అనుకుంటూ మాట్లాడుకోవడం గమనార్హం. కానీ.. ఘటనా స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదం జరగడానికి ప్రధాన కారణమేంటనేది తేల్చి స్పష్టమైన నివేదిక అందజేయాలని ఆదేశించారు. కానీ.. 'తరచూ జరుగుతున్న ప్రమాదాలకు కారణం ఆకతాయిల పనా?, విద్యుదఘాతమా?, లేక ఇంకా ఏదైనా కారణమా?' అనేది తేలాల్సి ఉంది. కానీ.. అధికారులు ఈసారైనా ఈ ప్రమాదంపై అసలు విషయాన్ని నిగ్గు తేలుస్తారా? లేక గతంలో మాదిరిగానే షరా మామూలే అని దాటవేస్తారా? అనే విషయం తేలాల్సి ఉంది.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని యార్డులో అగ్ని అపాయ సంకేతాలు (ఫైల్)



కొండరెడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

దమ్మపేట, జనవరి 16: కొండరెడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. ఏజెన్సీ మండలమైన దమ్మపేటలోని పలు గిరిజన గ్రామాల్లో కలెక్టర్ గురువారం ఆకస్మికంగా పర్యటించారు. పూసుకుంట, కట్కూరు గ్రామాల్లో కొండరెడ్ల ఆవాసాలను పరిశీలించారు. అక్కడి గిరిజనుల జీవన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులు, సమస్యల గురించి గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. కొండరెడ్ల గూడేలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

తిరుగు ప్రయాణంలో కొత్తగూడెం బస్టాండ్‌లో రద్దీగా ప్రయాణికులు

పల్లె టు పట్నం

- తీపిగురుతులు మిగిల్చిన సంక్రాంతి
- సొంత ఊళ్లను వదిలి నగరాలు, పట్టణాలకు కదిలిన జనం
- కిక్కిరిసిన ప్రయాణ ప్రాంగణాలు
- పాపికొండల వద్ద టూరిస్టుల సందడి

భద్రాచలం బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 16 (నమస్తే తెలంగాణ): పట్టణాల్లో జీవనం సాగిస్తున్న కుటుంబాలకు సంక్రాంతి పండుగ తీపి గురుతులు మిగిల్చింది. ఎన్నో అనుభూతులు, మధురస్మృతులు, పాత స్నేహాలతో గడిపిన క్షణాలు మనసునిండా నింపుకున్నారు. పండుగలో బంధువులు, స్నేహితులతో తెగ ఎంజాయ్ చేశారు. మూడ్రోజులపాటు ఆనందంగా గడిపిన పట్నంవాసులు తమ సొంతూళ్లను భారంతో వీడారు. గురువారం సంక్రాంతి సెలవులు ముగియడంతో పల్లెలను వదిలి పట్నాలకు తిరిగి పయనమయ్యారు. పాతస్నేహాలు, పల్లె వాతావరణాన్ని వదిలి జనం దీనంగా పల్లెలను వదిలివెళ్లారు. పల్లెలను వదలలేక మౌనంగా తిరుగు పయనమయ్యారు. ఒకరిఇంట్లో ఒకరు భోజనాలు చేసుకుని పాత సంగతులను గుర్తుచేసుకుని చిన్నప్పటి చదువులు, ఆటలు, ఆటవిడుపులు చేసుకున్న సంఘటనలు పల్లెల్లో దర్శనమిచ్చాయి. ఇలాంటి మధుర జ్ఞాపకాలను విడిచి బాధతోనే పట్నం ప్రయాణమయ్యారు.

కిక్కిరిసిన బస్టాండ్లు..

మూడ్రోజుల క్రితం పట్నాల నుంచి పల్లెలకు వచ్చిన జనం తిరిగి పట్నాలకు పయనమయ్యారు. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా బస్టాండ్‌లు కిక్కిరిసిపోయాయి. చాలామందికి బస్సులు దొరకక ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. సొంత వాహనాలు ఉన్న వాళ్లు ఫోర్‌వీలర్స్, టూవీలర్స్, టాటా ఏసీఈ, టాటా మ్యాజిక్‌ల్లో తమ గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. కొత్తగూడెం, భద్రాచలం, పాల్వంచ బస్టాండుల్లో ప్రయాణికులకు బస్సులు దొరకక నానా ఇబ్బందులు పడ్డారు.

పాపికొండల వద్ద సందడి..

సంక్రాంతి పండుగకు పల్లెలకు వచ్చిన ప్రజలు పాపికొండల విహారంలో తెగ సందడి చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన కుటుంబాలు ఆంధ్రాలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న పాపికొండలను సందర్శించారు. కొంత మందికి లాంచీ టికెట్లు దొరకక దట్టమైన అడవుల్లోకి వెళ్లి వనభోజనాలు వండుకుని ఎంజాయ్ చేశారు. ప్రతిరోజు 20 నుంచి 30 లాంచీలు విహార యాత్రకు పయనమయ్యాయి. తిరుగు ప్రయాణంలో భద్రాచలం నుంచి ఇతర జిల్లాలో ప్రయాణికుల రద్దీ బాగా కనబడింది.

పాపికొండల విహార యాత్రలో పర్యాటకులు

అర్హులకే ప్రభుత్వ పథకాలు

సారపాకలో సర్వేను పరిశీలించిన ఐటీడీఏ పీవో రాహుల్

సర్వేలో భాగంగా మహిళను వివరాలు అడుగుతున్న పీవో రాహుల్

బూర్గంపహాడ్, జనవరి 16: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలు అర్హులైన నిరుపేదలకే అందాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు తదితర పథకాల అమలుపై సారపాకలో గురువారం చేపట్టిన సర్వేను పీవో పరిశీలించారు. పాత సారపాక, కండక్టర్స్ కాలనీలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల జాబితా ప్రకారం సర్వే చేపట్టాలని, ప్రభుత్వ పథకాలకు అర్హులను ఎంపిక చేయాలన్నారు. రోజువారీ కూలీ పనులు చేసుకునే ఏ కుటుంబం రేషన్ కార్డు కోల్పోకుండా, జాబితాలో పేరు ఉండేలా చూడాలన్నారు. భూములు, ఆదాయానికి సంబంధించి ఒకే వ్యక్తికి ఒకేచోట రేషన్ కార్డు ఉండేలా చూడాలన్నారు. అనంతరం నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో ప్రభుత్వ భూమిని పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. పినపాక పట్టీనగర్, బూర్గంపహాడ్ తదితర ప్రాంతాల్లో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపీవో సునీల్ శర్మ, ఈజీఎస్ ఏపీవో విజయలక్ష్మి, ఏవో శంకర్, ఏఎస్‌వో ప్రదీప్‌లు సర్వేను ప్రారంభించి.. ఇళ్లకు వెళ్లి లబ్ధిదారుల వివరాలు సేకరించారు. సారపాక ఈవో కంది మహేశ్, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం కార్యదర్శి బాలయ్య, ఆర్ఐ నర్సింహారావు, జూనియర్ అసిస్టెంట్ అరుణ, రెవెన్యూ, ఐకేపీ, ఈజీఎస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యమివ్వాలి: డీఎంహెచ్‌వో

సత్తుపల్లి, జనవరి 16: ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలకు వచ్చే గర్భిణులకు సాధారణ ప్రసవాలు చేయడానికే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డీఎంహెచ్‌వో కళావతి బాయి వైద్యులకు సూచించారు. గంగారం పీహెచ్‌సీని గురువారం సందర్శించిన ఆమె.. ఆసుపత్రి పరిసర ప్రాంతాలు, రికార్డులు, మందుల నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. పుట్టిన పిల్లలకు వెంటనే ముర్రుపాలు పట్టించేలా తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది ప్రభుత్వం అందిస్తున్న సేవలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని, పుట్టిన పిల్లలకు వ్యాక్సిన్లు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వేయించేలా తల్లిదండ్రులకు వివరించాలన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే ఆర్ఎంపీలు, పీఎంపీల వద్ద వైద్యం చేయించుకోవద్దని, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని ఆమె సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం, పీహెచ్‌సీ వైద్యులు అవినాష్, డీటీవో దుర్గాభవాని, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆసుపత్రిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మధిరలో 'భట్టి' దిష్టిబొమ్మ దహనం

- బీఆర్ఎస్ దివంగత నాయకుడి నేమ్ బోర్డును తొలగించడంపై గ్రామస్తుల ఆగ్రహం
- డిప్యూటీ సీఎం ప్రోద్బలంతోనే అధికారులకు కాంగ్రెస్ నేతల ఫిర్యాదంటూ మండిపాటు
- బీఆర్ఎస్ సర్పంచ్ చొరవ తీసుకొని రింగ్ సెంటర్ నిర్మించడాన్ని జీర్ణించుకోలేక ఘాతుకం

మధిర: ఆత్కూరులో డిప్యూటీ సీఎం భట్టి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గ్రామస్తులు

మధిర/ మధిర రూరల్, జనవరి 16: స్థానిక ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎంగా ఉన్న భట్టి విక్రమార్క దిష్టిబొమ్మను సాక్షాత్తూ అతడి నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన ప్రజలు దహనం చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఎన్నో దశాబ్దాలుగా ఇక్కడి ప్రజలకు సేవ చేస్తున్న, గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తున్న, బీఆర్ఎస్‌కు చెందిన ఓ కుటుంబంపై ఉప ముఖ్యమంత్రి ప్రోద్బలంతో కాంగ్రెస్ నాయకులు కక్షపూరితంగా వ్యవహరించడాన్ని గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో ఏకంగా డిప్యూటీ సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను తెలియజేశారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది.

మధిర మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన 'అబ్బూరి' కుటుంబం ఇక్కడి ప్రజలు సుపరిచితం. ఈ కుటుంబంలోని పలువురు వ్యక్తులు దశాబ్దాలుగా గ్రామ సర్పంచ్‌గా కొనసాగుతూ వస్తున్నారు. గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతూ, అవసరమైతే సొంత నిధులతో ప్రజలకు సేవలందిస్తూ గ్రామస్తుల ఆదరణను చూరగొన్నారు. గడిచిన పంచాయతీ ఎన్నికల్లో ఇదే కుటుంబానికి చెందిన అబ్బూరి సంధ్య ఈ గ్రామానికి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్‌కు చెందిన ఈమె ప్రత్యేక చొరవ తీసుకొని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారు. సొంత నిధులను కూడా వెచ్చించి గ్రామ కూడలిలో రింగ్ సెంటర్ నిర్మింపజేశారు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం ఆమె భర్త రామకృష్ణ (మాజీ సర్పంచ్) అనారోగ్యంతో మరణించాడు. అందుకు గుర్తుగా గ్రామస్తుల అభీష్టం మేరకు ఆ రింగ్ సర్కిల్‌కు 'అబ్బూరి సర్కిల్' అని నామకరణం చేశారు. అదే పేరుతో అక్కడ ఓ బోర్డును కూడా ఏర్పాటుచేశారు. దీనిని కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేపోయారు. అప్పుడే అధికారులకు ఫిర్యాదులు చేశారు. గ్రామస్తుల అభీష్టం మేరకు అబ్బూరి సర్కిల్ పేరుతో బోర్డు ఏర్పాటు చేయడం, అందుకు కలెక్టర్ అనుమతి కూడా తీసుకోవడం వంటి కారణాలో అధికారులు కూడా చర్యలేమీ తీసుకోలేదు. కానీ తాజాగా కాంగ్రెస్ అధికారంలోకి రావడం, ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న భట్టి విక్రమార్క ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ఉండడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి.

భట్టి ప్రోద్బలంతో..

అయితే.. ఈ రింగ్ నిర్మాణం వల్ల గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఆ ప్రభుత్వంలో చొరవ తీసుకొని గ్రామాభివృద్ధికి పాటుపడిన బీఆర్ఎస్ సర్పంచ్‌కు ప్రజల్లో మంచి పేరు రావడాన్ని కాంగ్రెస్ నాయకులు తాళలేకపోయారు. ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ప్రోద్బలంతో తాజాగా మరోసారి రంగంలోకి దిగారు. పోలీసు బందోబస్తు మధ్య 'అబ్బూరి సర్కిల్' నేమ్ బోర్డులను గురువారం తొలగించారు. దీంతో అధికారులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భట్టి ప్రోద్బలం వల్లనే బోర్డును తొలగించారని ఆరోపిస్తూ అతడి దిష్టిబొమ్మను దహనం చేశారు. 'భట్టి దౌర్జన్యం నశించాలి.. భట్టి డౌన్‌డౌన్..' అంటూ నినాదాలు చేశారు. గ్రామస్తుల ఆందోళనకు బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. భట్టి విక్రమార్క ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి తప్ప చౌకబారు రాజకీయాలు చేయడం తగదని అన్నారు.

అబ్బూరి పేరు తొలగించడం హేయం: లింగాల

ప్రజా నాయకుడు అబ్బూరి పేరును డిప్యూటీ సీఎం భట్టి తొలగింపజేయడం హేయమైన చర్య అని జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు అన్నారు. ఆత్కూరు రింగ్ సర్కిల్‌లో అబ్బూరి పేరుతో ఉన్న నేమ్ బోర్డును భట్టి ప్రోద్బలం, కాంగ్రెస్ నేతల ఒత్తిడితో అధికారులు తొలగించిన అంశంపై 'నమస్తే తెలంగాణ'తో కమల్‌రాజు మాట్లాడారు. మధిర ఎంట్రన్స్‌లోని ఆత్కూరు క్రాస్‌రోడ్డులో గతంలో అధ్వానంగా ఉండేదని, అబ్బూరి కుటుంబ సభ్యులు వారి సొంత నిధులతో ఆ సర్కిల్‌ను మంచిగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. నాటి కలెక్టర్ సూచన మేరకు రాజ్యాంగబద్ధంగా పంచాయతీలో తీర్మానం చేశాకే, గ్రామస్తుల ఆమోదం పొందాకే ఆ గ్రామ మాజీ సర్పంచ్ అబ్బూరి రామకృష్ణ జ్ఞాపకార్థం 'అబ్బూరి సర్కిల్' అని నేమ్ బోర్డు పెట్టినట్లు వివరించారు. ప్రజాదరణ కలిగిన నేతల పేర్లు తుడిచి పైశాచిక ఆనందం పొందడం భట్టివిక్రమార్కకు సరైంది కాదని హితవుచెప్పారు.